క్లుప్తంగా

ఎస్‌ఎఫ్‌ఐ డైరీ ఆవిష్కరణ


డైరీలను ఆవిష్కరిస్తున్న వీసీ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

తిరుపతి సిటీ: స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రూపొందించిన నూతన ఆంగ్ల సంవత్సర డైరీలను ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, భగత్ రవి, నాయకులు వినోద్, తేజ, బాల పాల్గొన్నారు. వర్సిటీలోని సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని వారు అధికారులను కోరారు.

విశ్వకర్మ జయంతిని కార్మిక దినోత్సవంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి శీనప్ప

తిరుపతి కల్చరల్: విశ్వకర్మ జయంతిని జాతీయ కార్మిక దినోత్సవంగా నిర్వహించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి బి.శీనప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోని మొట్టమొదటి కార్మికుడు విశ్వకర్మ అని, ఆయన జయంతి నాడు కార్మిక దినోత్సవం జరుపుకోవడం సమంజసమన్నారు. అలా కాకుండా విదేశీ సంస్కృతిని అవలంబిస్తూ మే 1వ తేదీన కార్మిక దినోత్సవం నిర్వహించడం సరికాదన్నారు. దేశంలోని అతి పెద్ద కార్మిక సంస్థగా ఉన్న భారతీయ మజ్దూర్ సంఘ్ దేశవ్యాప్తంగా 2 కోట్ల మంది సభ్యులతో ఉందన్నారు. సమావేశంలో బీఎంఎస్ నేతలు సుబ్బారావు, బాలకృష్ణ, హేమ, రవి పాల్గొన్నారు.

ఓం శక్తి భక్తుల మాలధారణ


ప్రత్యేక అలంకరణలో ఓం శక్తి

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువు సమీపంలోని గంగమ్మ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఓం శక్తి అమ్మవారి చిత్రపటాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి చిత్రపటాలకు ప్రత్యేక అలంకరణలు చేసి విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణమంతా ఓం శక్తి నామస్మరణతో మార్మోగింది. అనంతరం భక్తులు శక్తి మాలధారణ చేశారు. కార్యక్రమంలో టీం మేనేజర్ మునిరాజు, ఓంశక్తి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీశక్తిపీఠాన్ని దర్శించిన అంబికా కృష్ణ


శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి, మాతాజీ శ్రీ రమ్యానంద భారతి ఆశీస్సులు పొందుతున్న అంబికా కృష్ణ

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువు సమీపంలోని శ్రీశక్తిపీఠాన్ని అంబికా దర్బారు బత్తి ఉత్పాదకులు అంబికా కృష్ణ శుక్రవారం దర్శించుకున్నారు. పీఠ నిర్వాహకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పీఠంలో కొలువైన శ్రీవారాహీదేవికి, శ్రీమరకతశక్తి కాళీదేవికి అంబికా కృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశక్తిపీఠం వ్యవస్థాపకులు కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి, మాతాజీ రమ్యానంద భారతి ఆశీస్సులు పొందారు.

నియామకం

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఎస్సీ, ఎస్టీ సెల్ కన్వీనర్‌గా గరివిడి వెటర్నరీ కళాశాల పారాసిటాలజీ విభాగం హెడ్ ప్రొఫెసర్ పి.మాలకొండయ్యను నియమిస్తూ రిజిస్ట్రార్ రవికుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ పదవిలో రెండేళ్లపాటు ఉంటారు. ప్రస్తుతం వర్సిటీ ఎస్సీ, ఎస్టీ సెల్ కన్వీనర్‌గా ఉన్న డాక్టర్ జి.గంగరాజు పదవీ కాలం ముగియడంతో అధికారులు మాలకొండయ్యను నియమించారు.

దయచూపరేమి.. గోవిందా..!

తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల మూలానే ఆర్టీసీకి సింహభాగం ఆదాయం వస్తోంది. ఎక్కడెక్కడో దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఏ శాఖలైనా సంతృప్తి పరంగా సేవలు అందించినా, అవగాహన లేని భక్తులకు సరైన సమాచారం చెప్పి మార్గదర్శనం చేసినా వారికి తిరుపతి మీద మరింత భక్తిప్రపత్తులు పెరుగుతాయి. 'మానవ సేవే మాధవ సేవ', 'ప్రయాణికులే మన దేవుళ్లు' అని చెప్పుకునే ఆర్టీసీ ఆ ప్రయాణికుల దేవుళ్లకు మాత్రం జరిమానాల వడ్డనతో ఖేదం కలిగిస్తోంది. ఇదేమిటి గోవిందా!? అని శ్రీవారి భక్తులు లబోదిబోమంటున్నారు.

- అపరాధంపై అత్యుత్సాహం
- పొరబాటున గరుడ వారధిపై నుంచి బస్టాండ్‌లోకి వస్తే మటాష్
- లబోదిబోమంటున్న తమిళనాడు, కర్ణాటక భక్తులు


బస్టాండ్‌లోకి పొరబాటున వారధిపై నుంచి వచ్చిన కార్లకు అపరాధం విధిస్తున్న బస్టాండ్‌లోని పోలీసులు

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోకి వెళ్లే గరుడ వారధి వంతెనపై ఆర్టీసీ సర్వీసులు మాత్రమే వెళ్లాల్సి ఉంది. మిగిలిన వాహనాలు (ప్రధానంగా కార్లు) వెళితే...ఒక్కో వాహనానికి రూ. 50 అపరాధం వడ్డిస్తున్నారు. అయితే పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తిరుచానూరు నుంచి తిరుమలకు వెళ్లే క్రమంలో గరుడ వారధి మీదుగా వాహనాల్లో వెళ్లడం పరిపాటి. అయితే గరుడ వారధి మార్గంలో బస్టాండ్‌లోకి... మరో మార్గం కపిలతీర్థానికి ఉంది. బస్టాండ్‌లోకి అని చిన్నపాటి బోర్డును మాత్రమే ఆర్టీసీ అధికారులు అక్కడ ఏర్పాటు చేశారు. వారధిపై నుంచి తిరుమలకు వెళ్లాల్సిన భక్తులు పొరబాటున బస్టాండ్‌లోకి దిగేస్తున్నారు. ఇదే అదునుగా అక్కడ కాపు కాసి ఉంటున్న పోలీసులు, ఆర్టీసీ సెక్యూరిటీ అధికారులు ఒక్కో వాహనానికి రూ.50 అపరాధం వేస్తున్నారు. తాము దారి తెలియక ఇలా వచ్చామని చెబుతున్నా అవేమీ పట్టించుకోవడం లేదు. చివరకు జరిమానా చెల్లించి, మళ్లీ వారు వారధి ఎక్కి... కపిలతీర్థంకు లేదా వారధి కిందే కపిల తీర్థం మీదుగా తిరుమలకు వెళుతున్నారు. వీరిలో అధిక సంఖ్యాకులు తమిళనాడు, కర్ణాటకకు చెందిన భక్తులే ఉంటున్నారు. వాస్తవానికి ఆర్టీసీ అధికారులు గరుడ వారధి..బస్టాండ్ ఎంట్రీ మార్గంలో పెద్ద సైజులో బోర్డులు ఏర్పాటు చేసి తమిళం, కన్నడ, తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో బోర్డులు ఏర్పాటు చేసి ఉంటే కొంతవరకు ఇలాంటి పరిస్థితులు తలెత్తేవి కావనే మాట వినిపిస్తోంది.

అపరాధం వేయడంతో అతి ఉత్సాహం

ఆర్టీసీ బస్సులు కాకుండా ఇతర వాహనాలు వారధి పై నుంచి బస్టాండ్‌లోకి వస్తే వాటికి అపరాధం విధించడానికి చూపుతున్న అత్యుత్సాహం బస్టాండ్‌లో చోరీలపై ఎందుకు చూపరనే విమర్శలొస్తున్నాయి. ఓ వైపు నిత్యం చోరీలు జరుగుతున్నాయి. బ్యాగులు, పర్సులు, సెల్‌ఫోన్లు పోగొట్టుకుని బావురుమంటున్న వారూ ఉంటున్నారు. కార్గోలోని వస్తువులు సైతం చోరీ చేసిన సంఘటనలు విదితమే. మరోవైపు పలు నిషేధిత వస్తువులను జోరుగా విక్రయిస్తున్నారు. ట్రాఫిక్ సమస్య నిత్యం చికాకే. బస్టాండ్‌లో పోలీసులు ఆరుగురు, ఆర్టీసీ సెక్యూరిటీ ఏడుగురు పనిచేస్తున్నారు. వీరంతా ప్రధాన సమస్యలపై దృష్టి పెట్టకుంటా వారధిపై నుంచి పొరబాటున బస్టాండ్‌లోకి వచ్చే వాహనాలపై మాత్రమే ప్రత్యేక శ్రద్ధ చూపడంలో ఔచిత్యమేమిటో అనే విమర్శలొస్తున్నాయి.

వేడుకగా వసంతోత్సవం..!


ఊరేగుతున్న శ్రీమూలస్థాన ఎల్లమ్మ

చంద్రగిరి: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. చివరి రోజైన గురువారం కొండచుట్టు ముగించుకుని, శుక్రవారం మధ్యాహ్నం అమ్మవారు, ధర్మరాజులతో కలసి అగరాల, ఐతేపల్లె, పులిత్తివారిపల్లె, కొటాల, రామిరెడ్డిపల్లె, రెడ్డివారిపల్లె మీదుగా ఆలయానికి చేరుకున్నారు. ఆయా గ్రామ ప్రజలు అమ్మవారికి స్వాగతం పలికి, ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న అమ్మవారు గ్రామ వీధుల్లో ఊరేగుతూ వసంతోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చందనం నీటిని భక్తులపై చల్లుతూ అమ్మవారు దర్శనమిచ్చారు. తదుపరి రాత్రి అమ్మవారు అశ్వవాహనంపై ఆసీనులై, ఆలయం నుంచి ఊరేగింపుగా కొత్తపేటలోని బ్రహ్మంగారి ఆలయం వద్దకు వెళ్లారు. తదుపరి అమ్మవారికి మంగళ వాయిద్యాల నడుమ తోటోత్సవం నిర్వహించడంతో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి.

ఘనంగా కృష్ణదేవరాయల జయంతి



కృష్ణదేవరాయుల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ శివ, బీజేపీ నాయకులు

తిరుపతి సిటీ/తిరుపతి గాంధీరోడ్డు : ఏపీ దళిత కాపు బీసీ అసోసియేషన్, బీజేపీ నాయకులు శుక్రవారం శ్రీ కృష్ణదేవరాయుల 554వ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక లీలామహల్ సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ శివ కాపు, బీజేపీ నార్త్ మండల అధ్యక్షుడు ప్రభాకర్ నాయుడు వేర్వేరుగా పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ, అన్ని మతాలను, కులాలను సమానంగా చూసి వారి అభ్యున్నతికి పాటు పడ్డ మహనీయులు కృష్ణదేవరాయులని కీర్తించారు. ఆంధ్రభోజుడుగా, సాహితీ సమరాంగ సార్వభౌముడిగా ప్రజల చేత రాయలు కీర్తించబడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, నరేంద్రయాదవ్, ఆనంద్, జయరామయ్య, బీజేపీ నాయకులు లోక ప్రభాకర్ నాయుడు, గుండాల గోపీనాథ్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, పురోహితుడు సురేష్‌స్వామి, దేసు నాగేశ్వర రావు, ఆంధ్ర తమిళ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు డీపీ ఆనంద్ పాల్గొన్నారు.

గంగుడుపల్లెలో పరుష పందేలు


జనసంద్రంగా మారిన గంగుడుపల్లె

చంద్రగిరి: మండలంలోని గంగుడుపల్లెలో శుక్రవారం పశువుల పందేరాలు(జల్లికట్టు)ను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. పరుగులు తీసిన ఎడ్లను నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు. ఎడ్లను నిలువరించి వాటి కొమ్ములకు కట్టిన పలకలను సొంత చేసుకుని విజయ గర్వంతో చిందులేశారు.

'స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్' విజయవంతం చేయండి

తిరుపతి తుడా: ప్రతి మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌ను విజయవంతం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహణపై శుక్రవారం తన కార్యాలయంలో అధికారులతో కమిషనర్ సమీక్షించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడవ శనివారం ప్రత్యేకమైన పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 2025 లోపు ఇంటింటా చెత్త సేకరణ 100 శాతం నిర్వహించేలా చేయడం, అక్టోబర్ లోపు చెత్తకుప్పలు లేకుండా చేయాలన్నదే ముఖ్య ఉద్దేశమన్నారు. నూతన సంవత్సరంలో క్లీన్ స్టార్ట్ అనే థీమ్‌తో చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. మూడవ శనివారం ప్రకాశం పార్కులో పరిశుభ్రత పనులు చేసి, మానవహారం ఏర్పాటు చేస్తామని, శెట్టిపల్లెలో చెత్తకుప్పలు తొలగించి మొక్కలు నాటనున్నట్లు వెల్లడించారు. ప్రజలు తడి, పొడి చెత్తను కాలువల్లో వేయకుండా వాటిని వేర్వేరుగా తమ సిబ్బందికి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, హెల్తాఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

వెదురుకుప్పం: మండలంలోని ఎర్రగుంట సమీపంలో ఉన్న ఓ ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం సాయంత్రం ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వెదురుకుప్పం పోలీసులు కథనం...తిరుపతి బొజ్జతారకం కాలనీకి చెందిన వెంకటరమణ(27), శీను శుక్రవారం వ్యాపారం నిమిత్తం పచ్చికాపల్లంకు వచ్చారు. వ్యాపారం ముగించుకుని సాయంత్రం 4.30 సమయంలో పచ్చికాపల్లం మద్యం దుకాణంలో మద్యం తీసుకుని రాజబావి కనుమ దాటుకున్నాక తిరుపతి రోడ్డు పక్కన చెక్ డ్యామ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ మద్యం సేవించి నీటిలో కొంత సేపు మునిగారు. ఆ తర్వాత ఇక వెళదాం అని శీను చెప్పడంతో.. నువ్వు వెళ్లు బట్టలు వేసుకుని వస్తానని వెంకటరమణ చెప్పాడు. దీంతో శీను రోడ్డు పైకి వచ్చాడు. ఆపై ఎంతసేపటికీ వెంకటరమణ రాకపోవడంతో అనుమానం కొద్దీ చెక్‌డ్యామ్ వద్దకు వెళ్లాడు. నీటిలో ఉన్న వెంకటరమణను పైకి తీసుకొచ్చే ప్రయత్నం చేశాడు. అయితే అప్పటికే అతను మృతి చెందాడు. కాలుజారి పడిపోవడంతో బలమైన గాయంతోగానీ, నీటిలో ఊపిరి ఆడక మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేశారు.

శెట్టిపల్లెలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు

- అధికారులకు కమిషనర్ మౌర్య ఆదేశం


శెట్టిపల్లెలో పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి మంగళం/తిరుపతి తుడా: నగరపాలక సంస్థ పరిధిలోని శెట్టిపల్లెలో రోడ్లు, మురుగు కాలువలు నిర్మాణం, తాగునీటి సరఫరా ఇత్యాది మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్, తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం శెట్టిపల్లె, ఉప్పరపాలెం తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు, రోడ్లు తదితరాలను ప్రజారోగ్య, ఇంజినీరింగ్, ప్లానింగ్ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. రోడ్లు, మురుగునీటి కాలువలు, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలపై ప్రజలు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించారు. ముఖ్యంగా అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. మురుగునీటి కాలువలు శుభ్రం చేసి, పారిశుద్ధ్యం మెరుగుపరచాలన్నారు. ప్రతి రోజూ నీటి సాంద్రత పరీక్షలు చేసి, నిర్దిష్ట సమయంలో తాగునీరు సరఫరా చేయాలన్నారు. రోడ్లలో గుంతల పూడ్చివేతకు, ఉప్పరపాలెం ప్రజలకు తాగునీరు సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డీఈ.రమణ, రెవెన్యూ ఆఫీసర్ రవి, ఏసీపీ బాలాజి, సర్వేయర్ కోటేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రేణిగుంట: అమర రాజా సంస్థల చేయూతతో, రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా దిగువమాఘంలో నూతనంగా ఏర్పాటు చేసిన అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణనిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. అభ్యర్థులకు శిక్షణ సమయంలో ఉపకార వేతనం పూర్తయ్యాక, ఉద్యోగావకాశం పొందేందుకు మొదటి బ్యాచ్‌కి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు సర్ఫేస్ మౌంట్ టెక్నాలజీ, పీసీబీ అసెంబ్లీ ఆపరేటర్ కోర్సుల్లో 24 నెలలు (3 నెలలు ట్రైనింగ్ సెంటర్లో, 21 నెలలు కంపెనీలో) శిక్షణనిస్తామన్నారు. శిక్షణ కాలంలో నెలకు రూ.12,072 ఉపకార వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 20న దిగువమాఘంలోని అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఇంటర్వ్యూ జరుగుతుందన్నారు. 10వ తరగతి, ఇంటర్ పాస్, ఫెయిల్ అయిన నిరుద్యోగ యువతీ యువకులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 87126 08589, 97392 90499, 88072 26264 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

–ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజి


ఏపీటీడీసీ చైర్మన్‌కు సమస్యలను నివేదిస్తున్న టూరిజం ఉద్యోగులు

తిరుపతి కల్చరల్: టూరిజం శాఖ ఉద్యోగులు తమ సమస్యలను రాతపూర్వకంగా తెలియజేస్తే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ టీడీసీ చైర్మన్ నూకసాని బాలాజి హామీ ఇచ్చారు. తిరుమల పర్యటనలో భాగంగా తిరుపతికి విచ్చేసిన చైర్మన్ శుక్రవారం సాయంత్రం అలిపిరి వద్ద అసంపూర్తిగా ఉన్న టూరిజం గెస్ట్ హౌస్‌ను పరిశీలించారు. అనంతరం జూ పార్క్‌లోని ఏపీటీడీసీ ట్రాన్స్‌పోర్టుకు చేరుకుని అక్కడ పాడైన సుమారు 12 బస్సులు, ఇతర యంత్రాలను పరిశీలించారు. స్క్రాప్ కింద వీటికి టెండర్లు ఆహ్వానించినట్లు అధికారులు ఆయనకు తెలిపారు. శ్రీవారి దర్శన ప్యాకేజీ బస్సులు నడుపుతున్న డ్రైవర్లు తాము నెలన్నర రోజులుగా ఖాళీగా ఉన్నామని, ఇతర రాష్ట్రాల తరహాలో టూరిజం ప్యాకేజీలకు అనుమతి ఇవ్వాలని చైర్మన్‌ను కోరారు. అనంతరం స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలకు సంబంధించిన టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు తమకు నెలల కాలంగా జీతాలు ఇవ్వలేదని, ఇకనైనా చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గైడ్స్ సిబ్బంది, ఉద్యోగులు వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి


సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

భాకరాపేట: రైతులు పంటల సాగులో సేంద్రియ ఎరువులు వాడి అధిక దిగుబడులను సాధించాలని చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండల వ్యవసాయాధికారులు ధనలక్ష్మీ, ఖాదర్‌బాషా కోరారు. శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వేరుశనగ, ఉలవ, వరి పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రబీ సీజన్ ఎరువుల యాజమాన్యం, పురుగులు, తెగుళ్ల నివారణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఎమ్మెల్యేలు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- దళిత గిరిజన సంఘాల డిమాండ్


రౌండ్ టేబుల్ సమావేశంలో దళిత సంఘాల నాయకులు, క్రైస్తవ మత పెద్దలు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): గిరిజన తెగల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టిన వారిపై ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత గిరిజన సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం రేణిగుంటలోని బేతేలు ప్రార్థనా మందిరంలో దళితులు, క్రైస్తవ మత పెద్దలతో గిరిజన సంఘం మండల నాయకురాలు ఈశ్వరమ్మ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు జె.తులసిరాజన్, ఏపీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి హరినాథ్, క్రైస్తవ సంస్థల ఐక్యవేదిక నాయకులు పాస్టర్ నవీన్ కుమార్ మాట్లాడారు. గిరిజనుల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టిన బీజేపీ స్థానిక నాయకుడు చంద్రశేఖర్ రెడ్డిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రేణిగుంట పోలీస్ అధికారులు క్రైస్తవ గిరిజన కుటుంబాలకి అండగా నిలిచి నిందితులపై కేసు నమోదు చేయాలని, లేని పక్షంలో క్రైస్తవ గిరిజన బాధితులకు అండగా నిలబడి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మురళి, ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు చీరాలయ్య, క్రైస్తవ సంస్థల ఐక్యవేదిక నాయకులుజాన్ బాబు, నాగరాజు, ఆశీర్వాదం, పరమానందం, ప్రసాద్, నథానియేలు, థామస్, చిన్నబ్బ, బాధితుడు పాస్టర్ అశోక్, గిరిజనులు పాల్గొన్నారు.